

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
మంగళవారం | డిసెంబర్ 05, 2023 | www.navatelangana.com



గుంభనం..

ఓటమిని జీర్ణించుకోలేక విషాదవదనంలో గులాబీసైన్యం

- కేసీఆర్‌లేని తెలంగాణను ఊహించుకోనంటూ మాజీ ఎమ్మెల్యే సుంకె కంటతడి
- ప్రాణం ఉన్నంత వరకూ కేసీఆర్ వెంటే ఉంటా: హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రకటన
- ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మెన్ పదవులకు ఒక్కొక్కరుగా రాజీనామా..
- అధికార కాంగ్రెస్‌లోకి 'స్థానిక సంస్థల' నేతల తొంగిచూపులు
- ట్రెండింగ్‌లో హూఈజ్ ఐటీ మినిస్టర్?..

ఉత్తర తెలంగాణలోనే బలమైన కేంద్రంగా 13 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కేవలం 5స్థానాలకే పరిమితైన బీఆర్‌ఎస్ కొంత చతికిలపడినట్టయింది. పైగా పార్టీ అధికారాన్ని కోల్పోవడంతో ప్రభుత్వ కార్పొరేషన్లకు చైర్మెన్లుగా ఉన్న జిల్లా నేతలు రాజీనామాలు చేశారు. ఓటమిపాలైన స్థానాల్లో గుంభనం నెలకొనగా.. 'కేసీఆర్ లేని తెలంగాణను ఊహించుకోలేకపోతున్నా' అంటూ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె కంటతడి పెట్టుకున్నారు. మరోవైపు స్థానిక సంస్థల పదవీకాలం దగ్గరపడుతున్న క్రమంలో అధికారం చేపట్టిన 'హస్తం' గూటికి పోయేందుకు కొందరిలో అంతర్మథనం మొదలైంది. ఇదే క్రమంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే 'పాడి' పార్టీ మారుతారనే ప్రచారాన్ని తెరదించుతూ 'ప్రాణం ఉన్నంతవరకూ కేసీఆర్ వెంటే ఉంటా' సదరు ఎమ్మెల్యే ప్రకటించారు. ట్రెండింగ్‌లో హూఈజ్ ఐటీ మినిస్టర్? అనే ట్యాగ్ సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతుండటం గమనార్హం.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్‌ఎస్‌కు బలమైన పట్టుగా ఉండే 13 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో కేవలం నాలుగు (కరీంనగర్, హుజూరాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల) స్థానాల్లోనే బీఆర్‌ఎస్ విజయకేతనం ఎగరవేసింది. మిగిలిన ఎనిమిది (మానకొండూర్, చొప్పదండి, వేములవాడ, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని) స్థానాల్లో ఓటమిపాలైంది. 2014లో జగిత్యాల, 2018లో మంథని తప్ప మిగిలిన అన్ని స్థానాలనూ దిగ్విజయంగా గెలుచుకుని బలమైన పార్టీగా ఎదిగి.. ఇప్పుడు అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్‌లో పట్టుసడలే పరిస్థితికి బీజం పడినట్టయింది. ఇప్పటికే సర్పంచులు, ఎంపీటీసీ,జడ్‌పీటీస్, కౌన్సిలర్, 2లో...

కేసీఆర్ లేని తెలంగాణను ఊహించుకోలేనంటూ..



కేసీఆర్ లేని తెలంగాణను ఊహించుకోలేక పోతున్నానంటూ కరీంనగర్ జిల్లా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కంటతడి పెట్టారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని,ఇక ముందు ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాట ఇచ్చారు. ఇదే సమయంలో 'రామన్న లేని, కేసీఆర్ లేని తెలంగాణను ఊహించుకోలేకపోతున్న. ప్రత్యేక తెలంగాణను కొట్లాడి తెచ్చిన కేసీఆర్ లేడే..' అంటూ పొరుగు రాష్ట్రాల వారూ అంటున్నారని ఒక్కసారిగా భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. దీంతో అక్కడే ఉన్న శ్రేణులూ ఒకింత బాధనూ వ్యక్తం చేశారు.

ఎన్నో ఏండ్లకు దక్కిన విజయం

- అసెంబ్లీలో తొలిసారి అడుగుపెడుతున్న 8 మంది ఎమ్మెల్యేలు
- ఒక్క కోరుట్ల అభ్యర్థియే తొలిపోరులోనే విజయం సాధించగా..
- మిగిలిన ఏడుగురూ ఏండ్లుగా గెలుపు కోసం పోరాడినవారే!
- ఓడినా నియోజకవర్గాన్ని వదలని గుర్తింపు ఉన్న నేతలే..


కవ్వంపల్లిసత్యనారాయణ
మానకొండూర్


మేడిపల్లి సత్యం
చొప్పదండి


పాడి కౌశిక్‌రెడ్డి
హుజూరాబాద్


ఆదిశ్రీనివాస్
వేములవాడ


లక్ష్మణ్‌కుమార్
ధర్మపురి


మక్కాన్‌సింగ్ ఠాకూర్
రామగుండం


పొన్నం ప్రభాకర్
హుస్నాబాద్


డాక్టర్ సంజయ్
కోరుట్ల

ఉత్కంఠగా సాగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ల ఎన్నికల్లో ఈ సారి 8 మంది శాసనసభకు తొలిసారి అడుగుపెడుతున్నారు. ఇందులో కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ బరిలోకి దిగిన తొలిసారే విజయం సాధించగా.. మిగిలిన ఏడుగురూ ఏండ్లుగా పోరాడి గెలుపును అందుకునే వారే ఉన్నారు. వీరంతా గత రెండు నుంచి నాలుగుసార్లు జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలైనా ఏనాడూ తమ నియోజకవర్గాలను వదలని నేతలుగా గుర్తింపు ఉన్నారే. ఆ 'సానుభూతి'యే ప్రధానభూమికపోషించగా.. ప్రభుత్వంపై వచ్చిన విసుగు, వ్యతిరేకత తోడై విజయం వారిని వరించింది. ఏదేమైనా తొలిసారిగా అసెంబ్లీలో 'అధ్యక్షా!' అంటూ అడుగుపెట్టబోతున్న 8 మంది ఎమ్మెల్యేల ప్రస్థానంపై స్పెషల్ స్టోరీ...

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

•మానకొండూర్ ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ తొలుత 2014లో టీడీపీ నుంచి పోటీ చేశారు. అప్పుడు 23627 ఓట్లురాగా మూడోస్థానంలో నిలిచారు. తరువాతి ఎన్నికల్లో పోటీ చేయకున్నా. 2023 ఈ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో చేరి బరిలోకి దిగారు. అయితే రెండుసార్లు గెలిచిన రసమయి బాలకిషన్‌పై ఉన్న తీవ్ర వ్యతిరేకతకుతోడు కాంగ్రెస్ గాలి ఆయనకు కలిసొచ్చి 32365 ఓట్ల మోజర్టీతో తొలిసారి గెలుపొంది అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. ఏడాది కాలంగా మానకొండూర్‌లోనే మకాం మార్చిన ఈయన నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ జిల్లా పార్టీ అధ్యక్షునిగా ఎదగడమూ ఆయనకు తోడైందని చెప్పవచ్చు.

•2009లో కరీంనగర్ ఎంపీగా పని చేసిన పొన్నం ప్రభాకర్ తరువాత వచ్చిన 2014, 2018 ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీస్థానం నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. రెండుసార్లు మూడోస్థానానికే పరిమితం అయ్యారు. ఎంపీ తరువాత రెండుసార్లు ఓడిపోయినా పార్టీని వీడకుండా ప్రభుత్వంపై పోరాడారు. ప్రతిసందర్భంలోనూ పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును అందుకుని ప్రజాందోళనలు నిర్వహించారు. ఈ ఆసారి ఎన్నికల్లో కరీంనగర్ పరిస్థితులు అనుకూలించవని భావించి హుస్నాబాద్ స్థానాన్ని ఎంచుకుని అక్కడ పోటీ చేశారు. బీసీ సామాజికవర్గం ఎక్కువగా ఉండటం, అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే ఒడితెల సతీష్‌బాబుపై వ్యతిరేకతకుతోడు తెలంగాణ ఉద్యమకారుడనే పేరున్న పొన్నం ప్రభాకర్ 19344ఓట్ల మెజార్టీతో గెలిచి తొలిసారి శాసనసభలో అడుగుపెట్టబోతున్నారు.

•చొప్పదండి నియోజకవర్గం నుంచి మేడిపల్లి సత్యం ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌పై 37439ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గతంలో 2014, 2018 ఎన్నికల్లో పోటీ చేసినా రెండుసారూ రెండోస్థానంలోనే నిలిచారు. గత ఎన్నికల్లో అయితే 50వేల ఓట్లు సాధించి గట్టిపోటీనే ఇచ్చారు. రెండుసార్లు ఓటమిపాలైనా నియోజకవర్గాన్ని వీడి ఎప్పుడూ వీడలేదు. ఇక్కడి రైతుల, భూనిర్వాసితుల సమస్యలపై నిత్యం పోరాడారు. అదే ఆయనకు ప్రజల్లో గుర్తింపు తెచ్చి, రెండుసార్లు ఓడిపోయారనే సానుభూతి తోడై ఈసారి విజయాన్ని కట్టబెట్టగా ఈయనా తొలిసారి అసెంబ్లీకి వెళ్తున్నారు.

•మక్కాన్‌సింగ్‌రాజ్ ఠాకూర్ పెద్దపల్లి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షునిగా ఉన్న ఈయన రామగుండం నుంచి రెండుసార్లు అసెంబ్లీకి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయినప్పటికీ అక్కడిస్థానిక సమస్యలపై పోరాడుతూ స్థానికంగానే అందుబాటులో ఉన్నారు. ప్రధానంగా ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉదంతంపై బాధితుల పక్షాన నిలబడ్డారు.దీంతో ఈసారి 56794ఓట్ల మెజార్టీతో గెలిచి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

•అడ్లూరి లక్ష్మణ్‌కుమార్... ఈయన 2009 కాంగ్రెస్ సర్కారులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మెన్‌గా పని చేసిన అనుభవం ఉంది. 2014, 2018 ఎన్నికల్లో ధర్మపురి అసెంబ్లీస్థానం నుంచి పోటీ చేయగా ప్రత్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై రెండుసార్లూ ఓడిపోయారు. గత ఎన్నికల్లో గట్టిపోటీనిచ్చిన ఈయన కేవలం 446 ఓట్ల తేడాతోనే ఓటమిపాలయ్యారు. ఈసారి ఎన్నికల్లో అక్కడి ప్రజలు లక్ష్మణ్‌కుమార్‌కే 22039ఓట్ల మెజార్టీతో అవకాశం ఇవ్వగా తొలిసారి శాసనసభకు ఎన్నికయ్యారు.

•ఆది శ్రీనివాస్... ఈయన వేములవాడ అసెంబ్లీ స్థానం నుంచి 2009 నుంచి 2010 ఉప ఎన్నిక కలుపుకుని 2014, 2018 ఎన్నికల్లో నాలుగుసార్లు పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ప్రతి ఎన్నికల్లోనూ కేవలం 3వేల 2లో...

గుంభనం..

మొదటిపేజీ తరువాయి....

కార్పొరేటర్ పదవులకు నెలల వ్యవధిలోనే గడువు ముగుస్తుండటంతో ఆ స్థానిక సంస్థల నేతల చూపు అధికారకాంగ్రెస్‌వైపు మళ్లుతున్నట్టుగా ప్రచారం సాగుతోంది. ఇదేసమయంలో గెలిచిన అభ్యర్థుల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కూడా తన మాతృపార్టీలోకి జంప్ అవుతారన్న ప్రచారం సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీంతో 'నా ప్రాణం ఉన్నంతవరకూ కేసీఆర్ వెంటే ఉంటాను' అని కౌశిక్‌రెడ్డి తనపై వస్తున్న ఆరోపణలకు తెరదించినట్టయింది.

ప్రభుత్వ కార్పొరేషన్ల పదవులకు రాజీనామాలు

రెండు రోజుల క్రితం వెలువడిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోగా.. ఓటమిపలైన బీఆర్ఎస్ ప్రభుత్వంలో పలు కార్పొరేషన్ల పదవుల్లో ఉన్న నేతలూ రాజీనామాలు చేశారు. అందులో కరీంనగర్ మాజీ ఎంపీ.. ప్రస్తుతం రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షులుగా ఉన్న బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణ తాను చైర్మెన్‌గా ఉన్న 'కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ'కి రిజైన్ చేశారు. అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఒల్లాల శ్రీనివాస్‌గౌడ్ కూడా రాజీనామా చేశారు. వీరితోపాటు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కార్పొరేషన్ చైర్మెన్‌గా ఉన్న ఇదే జిల్లా కేంద్రానికి చెందిన సర్దార్ రవీందర్‌సింగ్, రాష్ట్ర టూరిజం శాఖ చైర్మెన్‌గా ఉన్న హుజూరాబాద్‌కు చెందిన గెల్లు శ్రీనివాస్ తమ పదవులకు రాజీనామా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తమకు అప్పగించిన బాధ్యతలను శ్రద్ధతో నిర్వర్తించామని, తమ వ్యక్తిగత కారణాలతో ఆ పదవులకు రాజీనామా చేస్తున్నామని ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు.

ట్రెండింగ్‌లో ఐటీ మినిస్టర్.. కొత్త మంత్రి ఎవరు?

పదేళ్లుగా ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్ అద్భుత సేవలు అందించారని.. ఇప్పుడు ఆయన స్థానాన్ని భర్తీ చేసే నాయకుడు ఎవరంటూ సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్‌ను మిస్ అవుతామని పలువురు కామెంట్ చేస్తున్నారు. కొందరు బీఆర్ఎస్ అభిమానులు అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కేటీఆర్ ఐటీ శాఖ మంత్రిగా పనిచేయాలంటూ సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. రాజకీయాలను పక్కన పెడితే రాష్ట్రానికి ఐటీ కంపెనీలను తేవడంలో, సైబరాబాద్ పరిధిలో అభివద్ధి విషయంలో ఆయన పనితీరు మెచ్చుకోదగ్గ విధంగా ఉందంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ సర్కారులో కొత్త ఐటీ మినిస్టర్ ఎవరంటూ సోషల్‌మీడియాలో విపరీతమైన చర్చ సాగుతుండటం గమనార్హం.

రాష్ట్రస్థాయి పోటీలకు మానేరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న మానేరు విద్యాసంస్థల డైరెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్

పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్‌లో ఈనెల 5, 6వ తేదీల్లో జరుగనున్న 8వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల జూడో పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఇటీవల ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన 14 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని సూచించారు. అలాగే విద్యార్థులను మానేరు విద్యాసంస్థల చైర్మెన్ కడారి అనంత రెడ్డి, ప్రిన్సిపల్ జి.సరితా రెడ్డి, పీఈటీలు మహేందర్, జహేద, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వద్ధురాలి హత్య..

నవతెలంగాణ ఇల్లందకుంట



ఇల్లందకుంట మండల కేంద్రంలోని కనగర్తి గ్రామంలో ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. గ్రామానికి చెందిన మట్ట రాజిరెడ్డి భార్య మట్ట లక్ష్మి (75)ని అదే గ్రామానికి చెందిన నిందితుడు రామంచ కుమారస్వామి(25) కత్తితో గాయపరిచి హత్య చేసినట్లు ఇల్లందకుంట ఎస్సై రాజకుమార్ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నో ఏండ్లకు దక్కిన విజయం

మొదటిపేజీ తరువాయి....

ఓట్ల తేడాతోనే ఓటమిపాలవుతూ వచ్చారు. మధ్యలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీ నుంచి పోటీ చేసినా ప్రత్యర్థి చెన్నమనేని రమేష్‌బాబుకు గట్టిపోటీయే ఇచ్చారు. దీంతో నాలుగుపర్యాయాలు పోరాడుతూ వస్తున్న ఆది శ్రీనివాస్‌ను ఈసారి అక్కడి ప్రజలు 14581ఓట్ల మెజార్టీతో గెలిపించగా తొలిసారి అసెంబ్లీకి వెళ్తున్నారు. అయితే ఈయన కూడా ఏనాడూ వేములవాడ సెగ్మెంట్‌ను వదలిలేరు. ఏసమస్య వచ్చినా జనంతో కలిసి పోరాడారు. ప్రధానంగా అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రమేష్‌బాబు పౌరసత్వం వివాదంపై విరామం లేకుండా న్యాయపోరాటం చేశారు.

పాడి కౌశిక్‌రెడ్డి సైతం 2018 ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రత్యర్థి ఈటల రాజేందర్ వంటి బలమైన నాయకునిపై పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయినప్పటికీ అప్పుడు 60వేల ఓట్లు సంపాదించుకున్నాడు. మధ్యలో ఒక ఉప ఎన్నికవచ్చినా బీఆర్ఎస్‌లో చేరిన ఆయనకు చివరి నిమిషంలో టిక్కెట్ దక్కలేదు. ఈసారి అదే పార్టీ నుంచి బరిలోకి దిగి విజయం సాధించారు. ఈయన కూడా తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాలో ఉన్నారు.

డాక్టర్ సంజయ్‌కుమార్... కోరుట్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఈయన అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కుమారుడే. తండ్రి వారసత్వం తప్ప రాజకీయ అనుభవం లేని ఈయన తొలిసారి తన తండ్రి ఇచ్చిన అవకాశంతో కోరుట్లబరిలోనిలిచారు. అప్పటికే గెలుపు కోసం కాచుకుని ఓవైపు కాంగ్రెస్ అభ్యర్థి నర్సింగరావు ఉండగా.. ఇంకోవైపు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బీజేపీ నుంచి పోటీలో ఉన్నారు. ఈ ఇద్దరు బలమైన నాయకులను ఢీకొని మరీ 10వేల ఓట్ల మెజార్టీతో గెలుపును అందుకుని తొలిపోరులోనే ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - గంగాధర



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండలం బూర్గుపల్లి గ్రామంలోని తన నివాస కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి సుంకె రవిశంకర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సీఎంగా లేని పాలనను ఊహించుకోలేమంటూ భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. ప్రజాతీర్పును శిరసావహిస్తూనే ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని అన్నారు. 2018లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఎమ్మెల్యేగా ఎన్నికై కేసీఆర్, కేటీఆర్, వినోద్‌కుమార్, సంతోష్‌కుమార్ సంపూర్ణ సహకారంతో చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. రెండేళ్లు కరోనా, ఓ ఏడాది ఆర్థిక మాంద్యం ఉన్నా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించానని అన్నారు. ఎమ్మెల్యే హోదాలో ఉన్నా ప్రజల మధ్యనే ఉన్నానని, ఓడినా ప్రజల మధ్యనే ఉంటూ ఏ ఆపద వచ్చినా ప్రజలు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మనోధైర్యంతో ఉండాలని, గెలుపు, ఓటములు సహజమేనని అన్నారు. తెగించి కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన బీఆర్ఎస్‌కు ప్రజల ఆశీస్సులు ఎప్పుడు ఉంటాయని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో గంగాధర సింగిల్‌విండో చైర్మన్ దూలం బాలగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు వేముల దామోధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, బీఆర్ఎస్ నాయకులు ఆకుల మధుసూదన్, సముద్రాల అజయ్, మ్యాక వినోద్‌కుమార్, వేముల అంజి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వకృత్వ పోటీలలో అర్విన్‌ట్రీ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ - కరీంనగర్

వికాసతరంగిని కరీంనగ‌ర్ వారు పాఠశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీలలో అర్విన్‌ట్రీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వ్యాసరచన పోటీలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఐశ్వర్యారెడ్డి మొదటి బహుమతి, వేద రెండో బహుమతిని,ఆరో తరగతికి చెందిన వినిషిత మొదటి బహుమతిని, ఎనిమిదో తరగతికి చెందిన అమృత వర్షిణి రెండో బహుమతిని గెలుపొందారు. వకృత్వ పోటీలలో తొమ్మిదో తరగతి చదువుతున్న హర్షవర్ధన్ మొదటి బహుమతి, నిహార్ రెండో బహుమతిని గెలుచుకున్నారని పాఠశాలల చైర్మెన్ బి.రమణరావు తెలిపారు. బహుమతులను పాఠశాలల చైర్మెన్ రమణరావు విద్యార్థులకు అందించి, అభినందించారు. అనంతరం రమణ రావు మాట్లాడుతూ.. విద్యార్థులలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు, పోటీతత్వాన్ని పెంపొందించడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. తమ విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణిస్తున్నారని ఇందుకు సహకరిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్ల రాజీనామా

నవతెలంగాణ - భగత్‌నగర్





తెలంగాణలో అధికార మార్పిడి జరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కార్పొరేషన్ పదవులు చేపట్టిన వారు తమ బాధ్యతల నుంచి ఒక్కొక్కరు తప్పుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన రవీందర్ సింగ్ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ పదవికి, గెల్లు శ్రీనివాస్ యాదవ్ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు సేవ చేయాలి..

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య



సమావేశంలో మాట్లాడుతున్న దొమ్మాటి నర్సయ్య

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు సేవ చేయాలని ఎల్లారెడ్డిపేట మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తామంతా ప్రజలకు సేవకులుగా పనిచేస్తామని, ఎక్కడ సమస్య వచ్చినా అక్కడ కాంగ్రెస్ నాయకులు ముందుండి సమస్యను పరిష్కరించాలన్నారు. పరిపాలించే బాధ్యతను ఇచ్చినప్పుడు అంతే బాధ్యతతో ప్రజలకు సేవ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు చెన్నిబాబు, గంట బుచ్చగౌడ్, ఒగ్గు బాలరాజు పాల్గొన్నారు.

శాసనసభ ధ్రువీకరణ పత్రం అందజేత



ఎమ్మెల్యే ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కేటీఆర్

నవతెలంగాణ - సిరిసిల్ల

సిరిసిల్ల శాసనసభ్యునిగా ఎన్నికైన కేటీఆర్‌కు సిరిసిల్ల బీఆర్ఎస్ నేతలు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. సిరిసిల్ల శాసనసభ్యునిగా కేటీఆర్ గెలుపొందగా ఆయనకు ఎన్నికల అధికారులు గెలుపొందిన ధ్రువీకరణ పత్రం అందజేయాల్సి ఉంది. ఆదివారం ఆయన అందుబాటులో లేకపోవడంతో సిరిసిల్ల బీఆర్ఎస్ నేతలు ధ్రువీకరణ పత్రం అందుకున్నారు ఆ పత్రాన్ని సోమవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిందం చక్రపాణి, చీటీ నర్సింగారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బొల్లి రామ్మోహన్ కేటీఆర్‌కు అందించారు.

కాంగ్రెస్ పార్టీ విజయం పట్ల న్యాయవాదుల సంబరాలు



విజయ సంకేతం చూపుతున్న న్యాయవాదులు

నవతెలంగాణ - సిరిసిల్ల

కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో విజయం సాధించడంతో సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుతూ టపాసులు పేల్చుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పస్నుల కృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి విజయం అందించిన తెలంగాణ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికలు దొరల అహంకారానికి, తెలంగాణ ప్రజల మధ్య జరిగాయని.. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్లు తిప్పవరం అనిల్, పరుశురాములు, భగవాన్, బాషా, అల్లే శేఖర్, ప్రశాంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్చరీపై అవగాహన కల్పించాలి

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్

విద్యార్థులకు ఆర్చరి పట్ల అవగాహన కల్పించాలని, అందులోని పద్ధతులను సమగ్రంగా తెలుసుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థిని ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన సందర్భంగా అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విలువిద్యలో ఎన్నో విషయాలు నేర్చుకునేవి ఉంటాయని, ప్రత్యేకంగా ఏకాగ్రతను పెంపొందించే విధానాలను తెలుసుకుంటామని చెప్పారు. క్రీడల్లో లభించే లాభాలు, మరే ఇతర అంశాల్లో సాధ్యం కాదని చెప్పారు. ఇటీవల కాలంలో మహబూబాబాద్ రాష్ట్ర స్థాయి ఎస్జీఎస్ బాల బాలికల ఆర్చరి చాంపియన్ షిప్‌లో పాఠశాలకు చెందిన కె.వందన 9వ తరగతి అసమాన ప్రతిభను కనబరచడంతో పాటు త్వరలో గుజరాత్ వేడుకగా ఈ కప్పును అట్టహాసంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా విజేతకు పుష్ప గుచ్చంతో పాటు అర్హత పత్రాన్ని అందజేసి, భవిష్యత్‌లో జరిగే మరిన్ని పోటీలలో అద్భుతమైన విజయాన్ని నమోదు చేసి తెలంగాణ రాష్ట్ర కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కేటీఆర్ గెలుపుపై టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక కిషన్, మండల అధ్యక్షుడు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు కేటీఆర్ గెలుపుకోసం కష్టపడి పని చేశారని ఎప్పుడూ ఇదే విధంగా సమిష్టిగా పని చేయాలని ఆయన కోరారు.



కేటీఆర్ గెలుపుపై సంబరాలు జరుపుకుంటున్న బిఆర్ఎస్ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజల మధ్య ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. అదే విధంగా కేటిఆర్ మనకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, పార్టీ శ్రేణులకు అండగా ఉంటారని వారు అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ కల్పన, శిక్షణా కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ - గంభీరావుపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి అధ్యక్షతన టాస్క్, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు జరిగే 'ఉద్యోగ కల్పన, శిక్షణ' కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న బిఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్ నుండి 50మంది విద్యార్థులకు వారం రోజులపాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌పై మహీంద్రా ప్రైడ్ ట్రైనర్ రాంటేక్ ఓంజి శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల టాస్క్, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీపాక ధర్మపురి, వి.వాణి, డా.ఆంజనేయులు, మనోహర్, శ్రీనివాస్, డాక్టర్ బిక్షమయ్య, విజయ్, మహేష్, రాజేష్, శిరీష, శైలజ, ఉమారాణి, శ్రావణి, రజిత పాల్గొన్నారు.



సంబరాలు జరుపుతున్న కాంగ్రెస్ యువజన నాయకులు

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

నవతెలంగాణ - చందుర్తి

ప్రజల సంక్షేమమే మా ధ్యేయమని కాంగ్రెస్ యువజన నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి ఓటు వేశారని అన్నారు. కార్యక్రమంలో న్యాత నవీన్, సంతపురి బాలు, మెరుపుల రాజేందర్, యువజన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

యోగసనా భారత్ అధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల రాష్ట్ర స్థాయి యోగా పోటీలు జరిగాయి. ఈ పోటీలలో సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని మహాత్మా జ్యోతిరావు ఫూలే పాఠశాలకు చెందిన విద్యార్థి వెలిశాల అర్విన్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి నాలుగో స్థానంలో గెలుపొందాడు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్స్ జిల్లా అధ్యక్షుడు ఎలిగేటి కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థికి మెడల్‌ని అందజేశారు. ఈ నెల 18 నుండి 20 వరకు పంజాబ్‌లో జరిగే ఇంటర్నేషనల్ యోగ పోటీలకు అర్విన్ ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థిని అభినందించారు. భారత్ స్వాభిమన్ ట్రస్ట్ జిల్లా ఉపాధ్యక్షుడు అంకాలపు రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్, కోచ్ డానియల్, యోగాసనా స్పోర్ట్స్ కోశాధికారి చిటికెన శ్రీనివాస్, బీఎస్‌టీ ప్రధాన కార్యదర్శి సీహెచ్. రామస్వామి, లింగయ్య, వేణు, తదితరులు ఉన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న జిల్లా యోగాసన అసోసియేషన్ సభ్యులు

8న వాహనాల వేలం

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

కరీంనగర్ జిల్లా జైలులో ఈ నెల 8న ఉదయం 10.30 గంటలకు పాత వాహనాలు అయిన మారుతి ఓమ్ని వ్యాన్ ఫోర్ వీలర్ వెహికిల్, హీరో హెూండా సీడీ 100 టూ వీలర్ వెహికిల్‌ను వేలం పాట నిర్వహించనున్నట్టు కరీంనగర్ జిల్లా జైలు పర్యవేక్షణాధికారి తెలిపారు. ఆసక్తి గల వారు రూ.10వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని, అత్యధిక ధర పలికిన వారు అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు 9494632432 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

c m y k

ఆరు గ్యారంటీలలకు ప్రాధాన్యత

- కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆవశ్యకత ఉంది
- కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై న్యాయ విచారణ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల

ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్‌కు రెండు సార్లు అధికారం అప్పగిస్తే 60 వేల కోట్లతో మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని రూ.6లక్షల కోట్ల అప్పులు చేశారన్నారు. తెలంగాణ దశాబ్దకాలం వెనకబడిందన్నారు. కామారెడ్డిలో కేసీఆర్ ఓటమి ప్రజలకు కేసీఆర్ పట్ల వ్యతిరేకతకు అద్దం పడుతోంది. కమిషన్ల కక్కుర్తితో నిధులు దుర్వినియోగం చేశారని, 2009లో ఉమ్మడి రాష్ట్రంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఇల్లు లేని నిరుపేదల కోసం ఇళ్ల నిర్మించాలనే అంశాన్ని తెరపైకి తీసుకువచ్చామన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టి, ఒక్కొక్కరికీ 100 గజాల స్థలం చొప్పున 4000 మందికి ఇళ్లు కేటాయించామని ఆయన గుర్తు చేశారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందనే అక్కసుతో ఇళ్ల నిర్మాణం కనుమరుగు చేసి, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారని గుర్తు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రద్దు చేస్తారని ప్రచారం చేసి, లబ్దిదారులను భయాందోళనలకు గురి చేశారని ఆరోపించారు. మోడీ పాలనలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర సరుకుల ధరలు పెరిగి, సామాన్యులపై భారం మోపారని తెలిపారు. నల్ల చట్టాలు తాత్కాలికంగా ఉపసంహరించుకున్నప్పటికీ రైతుల మెడపై ఇంకా నల్ల చట్టాల కత్తి వేలాడుతూనే ఉందన్నారు. జీఎస్టీతో పన్నుల విధానం సరళీకరణతో పన్నులు తగ్గించాల్సి ఉండగా, మరింతగా పన్నుల భారం వేశారని విమర్శించారు. యూపీఏ పాలనలో బ్యారెల్ ముడిచమురు ధర 105 డాలర్లు ఉన్నప్పుడు డీజిల్ రూ.55, పెట్రోల్ రూ.70 ఉందని, మోడీ పాలనలో ముడి చమురు బ్యారెల్ ధర 80డాలర్లు ఉన్నప్పటికి డీజిల్ రూ.100, పెట్రోల్ రూ.110 ఉందని, ప్రధానమంత్రి మోడీ అదాని, అంబానీలను రుణ విముక్తులను చేస్తున్నారని, రైతాంగాన్ని రుణ విముక్తులను చేయడంలో శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని లోకసభ సీట్లను కాంగ్రెస్ గెలుపొందాల్సిన అవసరం ఉందన్నారు. కడియం శ్రీహరి వ్యాఖ్యల్లో కుట్ర కోణం దాగుందని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను బీజేపీ చీల్చిందని, బీజేపీ చీల్చిన ఓట్లతో రాష్ట్రంలో 15 చోట్ల బీఆర్ఎస్ గెలుపొందిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల ఎమ్మెల్యేగా గెలు పొందిన డాక్టర్ సంజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభి మానులు కష్టపడి పనిచేశారు. కార్యకర్తలు మానసిక స్థైర్యం కోల్పోవద్దు. అందరికి అందుబాటులో ఉండి, సేవలం దిస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్ర గామిగా నిలిపేందుకు కృషి చేస్తానని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కొత్తూరి మహేశ్

నవతెలంగాణ - కొడిమ్యాల

కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన వెలుపుల దుర్గయ్య గత మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న కొత్తూరి మహేష్ సోమవారం మృతుడి భార్యను పరామర్శించి తక్షణమే రూ .5 వేలు ఆర్థిక చేయూతను అందించారు. ఆయన పెంట మోహన్, శ్రీనివాస్, కొండయ్య,అశోక్, దిలీప్, గణేష్, సతీష్, ఆదిత్య, దినేష్, సురేష్, ప్రశాంత్, అనిల్, రాజేష్, ప్రభాకర్, గంగస్వామి తదితరులు ఉన్నారు.

సామాన్యుల సంక్షేమం కాంగ్రెస్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బుగ్గారం

అన్ని వర్గాలకు సంక్షేమం అందించడమే కాంగ్రెస్ లక్ష్యం అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అట్లూరి లక్ష్మణ్‌కుమార్ గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్ష పాత్రలో సామాన్య ప్రజల అభివృద్ధి అహర్నిశలు పోరాటం చేసిన తమకు అధికారం అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన 6 గ్యారంటీలను మండలంలోని ప్రతి గడపగడపకు చేరేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, యూత్ అధ్యక్షుడు బీర్పూరి తిరుపతి, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దనవేని శంకర్, పార్టీ సీనియర్ నాయకులు జంగ శ్రీనివాస్,దసర్తి పోషన్న, రాజేశం, తాడేపు లింగన్న, సిగిరి అంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

అదనపు కలెక్టర్ బి.ఎస్.లత

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ప్రజల సమస్యలకు సంబంధించిన అర్జీలకు సమాచారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ బి.ఎస్.లత అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయాల సముదాయ భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లా డుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారుకు సమాధానం అందించాలని సూచించారు. అలాగే సమాచార హక్కు చట్టం, కోర్టు కేసులు, మానవ హక్కుల కమీషన్ నుంచి వచ్చే దరఖాస్తులు, లేఖలకు స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు. శాసన సభ ఎన్నికల నేపథ్యంలో గత రెండు మాసాలు ఎన్నికల విధులతో పాటు పరిపాలన అంశాలు కూడా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతా వరణంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించామని, ఎన్నికల విధులు నిర్వహించిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ ప్రజావాణిలో జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు బత్తిని రాజాగౌడ్

నవతెలంగాణ-మెట్‌పల్లి

తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ యూఏఈ, దుబాయ్ అధ్యక్షుడు బత్తిని రాజాగౌడ్ అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీకి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతోకాలంగా గల్ఫ్ కార్మికులు విదేశాల్లో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గల్ఫ్ కార్మికులు ఎదురు చూస్తున్నారని రాజకీయ నాయకులు, పార్టీలు హామీలు ఇస్తూ ఎన్నికలు అయిపోగానే మరచిపోతున్నారన్నారు. గల్ఫ్ దేశాల నుంచి రోజుకో శవం, తెలంగాణకు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 2009 మందికికి పైగా కార్మికులు గల్ఫ్ కార్మికులు మృతి చెందినట్టు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం గల్ఫ్ దేశాలలో అమరులైన తెలంగాణ కార్మికులకు సంతాపం తెలుపుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బోర్డ్‌తో పాటు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని, గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి 500 కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయించాలని, ప్రవాసి భారతీయ ప్రమాద బీమా పథకంలో సహజ మరణంను చేర్చాలని కోరారు. ఈ సమావేశంలో ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ యూఏఈ దుబాయ్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గల్ఫ్ కార్మిక నాయకులు

ఎమ్మెల్యే సంజయ్‌కి అభినందనల వెల్లువ



పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం మోతే రోడ్డులో సార్వత్రిక ఎన్నికల్లో జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డిని కలిసిన జువ్వాడి నర్సింగరావు

నవతెలంగాణ -మెట్ పల్లి

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడంతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని సోమవారం కోరుట్ల నుంచి పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థి జువ్వాడి నర్సింగ్ రావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని తెలంగాణాలో అధికారంలోకి తీసుకు వచ్చినందుకు ధన్యవాదములు తెలిపారు.



అభివృద్ధే ప్రధాన ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

నవతెలంగాణ-మెట్‌పల్లి

కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం అని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మొదటి సారిగా మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇచ్చిన కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజవర్గ అభివృద్ధి తన ప్రధాన ఎంజెండా అన్నారు. నియోజవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేలా కృషి చేస్తానన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలతో, శిక్షణ ఇప్పిస్తామని,తన విజయం కోసం కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల విశ్వాసం మేరకు అభివద్ధికి తోడ్పాడుతానన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, మార్గం గంగాధర్ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సంజయ్‌ని కలిసిన యువజన నాయకులు

డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ని సోమవారం బీఆర్ఎస్ యువజన నాయకుడు ఓజ్జల శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యేను కలిసినవారిలో నాయకులు గంగాధర్, రాజన్న,శివ, చరణ్ ,ఉన్నారు.

సింగరేణిలో గుర్తింపు ఎన్నికల నగారా..

- డిసెంబర్ 27న కార్మిక సంఘం ఎన్నికలు
- హైదరాబాద్‌లో ఎంప్లాయిస్ యూనియన్లతో సీఎల్‌సీ భేటీ
- ఓటరు లిస్టు అందజేత



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు



కార్మిక ఓటర్ల లిస్టులను అందజేస్తున్న అధికారులు

కోల్‌సిటీ, నవతెలంగాణ:
సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణపై స్పష్టత వచ్చింది. డిసెంబర్ 27న ఎన్నికలు జరగనున్నాయి. గత అక్టోబర్28న ఈ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో సోమవారం డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు హైదరాబాద్‌లో 13 కార్మిక సంఘాల ప్రతినిధులు, సింగరేణి యాజమాన్యంతో సమావేశం నిర్వహించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్ 7న నామినేషన్లు ముగిసి 10న కార్మిక సంఘాల ఎన్నికలకు సంబంధించిన గుర్తులను సైతం కేటాయించినా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా పడిన విషయం తెలిసిందే. సోమవారం కార్మిక సంఘాలతో సమావేశానికి హాజరైన సింగరేణి యాజమాన్యం కార్మికులకు సంబంధించిన ఓటరు లిస్టును యూనియన్లకు అందజేసింది. ఆరు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న సింగరేణిలో మొత్తం 39,748 మంది కార్మికులు ఈ ఎన్నికల్లో పాల్గొననున్నారు.

అసెంబ్లీ ఫలితాల ప్రభావం.. !
గతంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన సింగరేణి ఎన్నికల ఫలితాలు అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపించాయి. ఈ నేపథ్యంలో నవంబరు 30న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అక్టోబర్‌లో జరగాల్సిన సింగరేణి గుర్తింపు ఎన్నికలను ప్రభుత్వం పలు కారణాలు చెబుతూ వాయిదా వేయించింది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ఫలితాలు కూడా రావడంతో కార్మిక సంఘం ఎన్నికలపై కదలిక వచ్చింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో దాని అనుబంధ సంఘం ఈ ఎన్నికలపై ప్రభావం చూపనుంది.

కాలపరిమితి ముగిసినా నో ఎలెక్షన్..
గత సింగరేణి కార్మిక సంఘం ఎన్నికలు 2017 సెప్టెంబరు 5న జరగగా అప్పుడు టీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా ఉన్న టీబీజీకే ఎస్ 11 ఏరియాలకు గాను 9 ఏరియాల్లో గెలిచి గుర్తింపు సంఘంగా అవతరించింది. 2 ఏళ్ల కాలపరిమితికి ఈ ఎన్నిక జరిగినా టీబీజీకేఎస్ నాయకులు పలు కారణాల రీత్యా కోర్టును ఆశ్రయించి మరో రెండేళ్ల కాలపరిమితికి అనుమతి పొందారు. ఆ పరిమితి సైతం ముగిసి రెండేళ్లు కావస్తున్నా ఈ ఎన్నిక నిర్వహించేందుకు సింగరేణి యాజమాన్యం ఆసక్తి చూపలేదు. సింగరేణి ప్రభుత్వ అనుబంధ సంస్థ కావడం, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతోనే ఈ ఎన్నిక వాయిదా పడినట్లు ఆరోపణ. దీంతో ఆరు సంవత్సరాల పాటు టీబీజీకే ఎస్ గుర్తింపు సంఘంగా కొనసాగింది.

జాతీయ సంఘాల ప్రభావం..
ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం మార్పు జరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ అనుబంధ సంస్థ అయిన ఐఎన్‌టీయూసీ, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీ చేసిన సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీతో పాటు సింగరేణి ప్రాంతంలో కాంగ్రెస్‌కు మద్దతు పలికిన సీఐటీయూ ఈ ఎన్నికల్లో తమ ప్రభావం చూపనున్నాయి. ఈ నేపథ్యంలో కార్మికులు టీబీజీకేఎస్‌తో పాటు ఏ కార్మిక సంఘానికి మద్దతు పలుకుతారో అనే ఉత్కంఠ నెలకొంది. డిసెంబర్ 27న ఎన్నికతో పాటు అదే రోజు ఫలితాలు సైతం వెలువడనున్నాయి.

ఎమ్మెల్యేను సన్మానించిన రియల్టర్లు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రియల్టర్లు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి జిల్లా రియల్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెగడ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావును ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన శాసనసభ్యుడు విజయ రమణారావును కలిసి గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రియల్టర్ల సమస్యలు వివరించగా,రియల్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.కార్యక్రమంలో రియల్టర్లు రేగుంట అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న అభిమానులు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి విజయ రమణారావు గెలుపొందాలని మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఒడుసుల పరుశరామ్ ఎన్నికల ముందు ఊరి పోచమ్మ దేవతను వేడుకున్నారు. కోరిక తీరడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరశు రామ్ సోమవారం పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, 21 కొబ్బరికాయలు పోచమ్మ తల్లికి సమర్పించి మొక్కు తీర్చుకున్నాడు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు మేలు జరుగుతుందని

రామగుండం
లీగల్ సెల్ ఆధ్వర్యంలో సంబరాలు



బాణసంచా కాలుస్తున్న లీగల్ సెల్ సభ్యులు

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం ఎమ్మెల్యేగా రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ భారీ మెజారిటీతో గెలిచిన సందర్భంగా రామగుండం లీగల్ సెల్ చైర్మన్ కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో గోదావరిఖని మున్సిఫ్ కోర్టు ముందు టపాకాయలు కాల్చి, అనంతరం న్యాయవాదులకు స్వీట్స్ పంచి సంబరాలు చేశారు. కార్యక్రమంలో లీగల్ సెల్ కన్వీనర్ ముష్మె రవి కుమార్, వైస్ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నూతి సురేష్ కుమార్, సభ్యులు కాదాసి శేఖర్, చెలికల శ్రీనివాస్, మిడివెల్లి వెంకటేష్ తదితరులున్నారు.

ప్రజలు కాంగ్రెస్‌పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయం

కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతల, మహంకాళి

నవతెలంగాణ-గోదావరిఖని:
ప్రజలు కాంగ్రెస్‌పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళి స్వామి హామీ ఇచ్చారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ పార్టీ అభ్యర్థి రాజ్ ఠాకూర్‌పై నమ్మకంతో ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించిన ఈ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలకు ముందు పార్టీ ఇచ్చిన వాగ్దానాలతో పాటు ఆరు గ్యారెంటీలను అమలుపరి చేందుకు కృషి చేస్తామన్నారు. ఏ వర్గం ప్రజలను కూడా ఇబ్బందులకు గురి చేయబోమని, ప్రజాస్వామ్య యుతంగా పరిపాలన కొనసాగేలా చూస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ అభివృద్ధి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పథకాలు అర్హులకు అందేలా చూస్తామని, అన్ని రంగాలలో రామగుండంను అభివృద్ధి చేసేందుకు సాయి శక్తుల కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు కాల్వ లింగస్వామి, ఎం.రవికుమార్, ముస్తఫా, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్ ,యుగంధర్, కుమార్,పాల్గొన్నారు.

ఎంచర్ల మహేష్‌పై దాడిని ఖండించిన ఖని న్యాయవాదులు

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
ఆదివారం రాత్రి గోదావరిఖని అడ్డగుంటపల్లిలో న్యాయవాది ఎంచర్ల మహేష్‌పై దుండగులు జరిపిన దాడిలో ఆయనకు తీవ్ర గాయాలు కాగా, న్యాయవాదిపై దాడి హేయమైన చర్యగా భావిస్తూ గోదావరిఖని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఉదయం కోర్టు విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఇలాంటి దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. దాడిని ఖండిస్తూ దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదులు సీహెచ్.శైలజ, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, ఆల్ ఇండియా అడ్వకేట్ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు వేల్పుల మురళీధర్ యాదవ్, జువ్వాజి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

39వ డివిజన్‌లో విజయోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం ఎమ్మెల్యేగా మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ విజయం సాధించడం పట్ల ఆదివారం రాత్రి రామ గుండం కార్పొరేషన్ 39వ డివిజన్‌లో విజయోత్సవ ర్యాలీని చేపట్టారు.ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్ల మధ్య డ్యాన్సులు చేసుకుంటూ ఈ ర్యాలీని కొనసాగిం చారు. రామగుండం ప్రజల కోసం అనేక సంవత్సరా లుగా పోరాడుతున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ఈ సారి అవకాశం కల్పించడం పట్ల రామగుండం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీధర్ బాబును సీఎం చేయాలని
హైద్రాబాద్‌కు నాయకులు



నవతెలంగాణ-రామగిరి
మంథని నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ ఎల్లా హోటల్‌లో జరిగే సీఎల్పీ సమావేశానికి తరలివెళ్లారు. అఖండ మెజారిటీతో గెలిచిన దుద్దిళ్ల శ్రీధర్ బాబును ముఖ్యమంత్రి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నవ తెలంగాణతో మాట్లాడారు. శ్రీధర్ బాబు మంథని నుంచి ఐదు సార్లు గెలిచారని, అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో మంత్రిగా, విప్పుగా, పనిచేసిన అనుభవం ఉందని, సౌమ్యుడు విద్యావేత్త అయినా శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి పదవికి అర్హుడని వారు తెలిపారు. కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, ఉమ్మడి కమాన్‌పూర్ మండల జెడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డి, జెడి మల్హర్ మండలం జడ్పీటీసీ ఐత రాజిరెడ్డి, జెడి నగర్ సర్పంచ్ సూర సమ్మయ్యలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం



నవతెలంగాణ ఓదెల:
ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన చిట్ల శ్రీనివాస్ గుడిసె ఆదివారం రాత్రి పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం సుమారు రాత్రి 10 గంటల ప్రాంతంలో మంటలు వ్యాపించి పూర్తిగా గుడిసె దగ్ధమైందన్నారు. గుడిసెలో 10 వరి ధాన్యం బస్తాలు,5 బస్తాల బియ్యం కట్టు దాదులు, వ్యాన్‌కు సంబంధించిన పనిముట్లు ఉన్నట్లు తెలిపారు.గుడిసెలో ఉన్న వాటి విలువ సుమారు లక్ష యాభై వేల వరకు ఉంటుందని తెలిపారు.

ప్రజల తీర్పును శిరసావహిస్తాం

- అధికారం లేకున్నా ప్రజల పక్షానే
- తమ కార్యకర్తలపై భౌతికదాడులు అమానుషం
- తాజా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:
ప్రజా తీర్పును శిరసావహిస్తామని, అధికారం లేకున్నా ప్రజల పక్షాన నిలబడతామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆదేశానుసారం తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమ కారులు, తనకు ఓటు వేసిన ప్రజలకు ముందుగా ఆయన కతజ్ఞతలు తెలిపారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు, ఈ ప్రాంతానికి ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే వరకు తమ గులాబీ సైన్యం, ఉద్యమకా రులు ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తామన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ లో చేరి ఎన్నికల్లో చురుకుగా పనిచేసిన తమ కార్యకర్త మహేష్‌పై ఆదివారం కొందరు దాడి చేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు, అభియోగాలు చేయడం సాధారణమని, దాన్ని కక్ష సాధింపు ధోరణితో దాడికి పాల్పడడం అమానుషమన్నారు. తమ కార్యకర్తలకు, నాయకులకు ఏది జరిగినా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ బాధ్యత వహించాలన్నారు. తన జీవితం ప్రజా సేవకే అంకితమని, ఓటమి ఎదురైనా వెనుకడుగు వేసేది లేదన్నారు. విలేకరుల సమా వేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మూల విజయ రెడ్డి, కౌశిక హరి, జడ్పీటీసీ ఆముల నారాయణ, గనముక్కుల తిరుపతి, కల్వ చర్ల కష్ణవేణి, సాగంటి శంకర్, జాహిద్ పాషా, మల్లేష్, తదితరులున్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

న్యాయవాదిపై దాడిని ఖండించిన కాంగ్రెస్ లీగల్ సెల్

నవతెలంగాణ-గోదావరిఖని:
న్యాయవాది ఎంచర్ల మహేష్‌పై జరిగిన దాడిని రామగుండం కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు ఖండించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం రాత్రి స్థానిక న్యాయవాది ఎంచర్ల మహేష్‌పై జరిగిన దాడికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఎలాంటి సంబంధం లేకున్నా కొంత మంది నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరైంది కాదని అన్నారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేసి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలు చేపడితే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ కొప్పుల శంకర్, వైస్ చైర్మన్ మాదాసు శ్రీను, నూతి సురేష్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ లీగల్ సెల్ సభ్యులు

బొగ్గు గనులపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు


పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గెలవడం పట్ల ఓసీపీ-5 కాంగ్రెస్ పార్టీ నాయకులు జనగామ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం సంబరాలు జరుపుకు న్నారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, బాణసంచా కాల్చి ఉద్యోగులకు స్వీట్లు పంచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాయకులు పెంచాల తిరుపతి మాట్లాడుతూ సింగరేణి కార్మికులు, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ అన్ని యూనియన్ల సహకారంతో భారీ మెజారిటీని అందించినందుకు అందరికి ధన్యవాదాలు తెలిపారు. సింగరేణి కార్మికులు ఎదురుకొంటున్న ప్రధాన సమస్యలన్ని పరిష్కారిస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం క్రిష్ణ, కచ్చకాయల సదానందం, ఎ.క్రిష్ణ, ఎల్.అశోక్, బద్రిశంకర్, సాగర్, ఎల్.ఆంజనేయులు, ఏఐటీయూసీ నాయకులు గంది ప్రసాద్, రాయిడి శ్రీను, మాధన మహేష్, రావిశెట్టి శ్రీను, బోగే సతీష్,సీఐటీయూ నాయకులు గౌస్, ఓవర్మెన్ విజయ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండెటి ఐలయ్య యాదవ్



నవతెలంగాణ ఓదెల:
అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు, ఇది ప్రజా విజయమని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండెటి ఐలయ్య యాదవ్ అన్నారు. ఓదెల మండలం కొలనూరులో ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన తెలంగాణ ఉద్యమకారులను కేసీఆర్ మరిచిపోయి కనీస గౌరవం ఇవ్వలేదన్నారు.ప్రతి తెలంగాణ ఉద్యమకారునికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సామ రాజేందర్,కర్రె లక్ష్మారెడ్డి, అమ్ములుశంకర్, తుమ్మల బాబు, తుంగాని దేవేందర్, గుండేటి రమేష్, అట్టపెల్లి రాజు,దొడ్ల బాబురావులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నిత్యం ప్రజలకు అండగా ఉంటుంది

నవతెలంగాణ-మంథని
కాంగ్రెస్ పార్టీ కష్టసుఖాలతో పాటు ప్రజలకు నిత్యం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్,ఎంపీపీ కొండ శంకర్, అసెంబ్లీ ఎన్నికల మీడియా కన్వీనర్ ఇనుముల సతీష్,ప్రచార కమిటీ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, అన్నారు. సోమవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంథని మండలంలో 4786 మెజార్టీ శ్రీధర్ బాబుకు వచ్చినందుకు చాలా సంతోషమని,భారీ మెజార్టీతో ఎమ్మెల్యే శ్రీధర్ బాబును గెలిపించిన ప్రజలకు,కార్యకర్తలకు, నాయకులకు, పేరు పేరునా ధన్యవాదములు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మంథని నియోజక వర్గ ప్రజలకు శ్రీధర్ బాబు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, అండగా ఉంటారని వారు తెలిపారు. ఈ సమావేశంలో మంథని అసెంబ్లీ ఎన్నికల మీడియా కన్వీనర్ ఇనుముల సతీష్, మండల టౌన్ ప్రచార కమిటీ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావులు ఉన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మా ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మారేల్లి రాజిరెడ్డి

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:
మా కాంగ్రెస్ పాలనలో ప్రజల వద్దకే పాలన సాగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మారేల్లి రాజిరెడ్డి అన్నారు.సోమవారం యైటింక్లైన్ కాలనీలోని ప్రెస్ భవన్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు గనుకనే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించారని అన్నారు.అధిక మెజారిటీ అందించిన 8వ కాలనీ ఓటర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఇక మీదట కార్యకర్త,నాయకుడు అనే తేడా లేకుండా మంచి ప్రవర్తనతో ప్రజల మన్ననలు పొందుతామని వారు వ్యాఖ్యానించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ నూతన రాష్ట్రం కదా అని ప్రజలు బీఆర్ఎస్‌కు అధికారం అప్పగిస్తే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఇకపై రాష్ట్రం అంతా అవినీతి రహిత పాలన సాగిస్తూ ప్రజల మన్ననలు పొందుతామని రామగుండం, మంథని, పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించినందుకు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో చాట్ల సదానందం, మార్క రాజు, సునీత, రాములు,తిరుపతి రెడ్డి,మెరుగు రాజేష్, యాదగిరి తిరుపతి,అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలి

దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమితి సభ్యుడు మద్దెల దినేష్

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు పూర్తి చేసుకున్నదని, కానీ అట్టడుగు వర్గాలైన దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీ, వెనకబడిన తరగతుల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు వారి దరి చేరలేదని జాతీయ దళిత సమ్మిట్ పిలుపుతో దళితుల హక్కులకై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పార్లమెంట్ మార్చ్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర సమితి సభ్యుడు మద్దెల దినేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించి వారి అభివృద్ధికి ఖర్చు పెట్టే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర చేస్తుందని ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలు చేయడం లేదని, విస్తారంగా ఉపాధిని కల్పిస్తున్న ప్రైవేట్ రంగంలో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు అమలు చేయడం లేదని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు.



పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొన్న మద్దెల దినేష్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
కరీంనగర్
మంగళవారం | డిసెంబర్ 05, 2023 | www.navatelangana.com

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను

బీఆర్ఎస్, కేసీఆర్‌తోనే నా ప్రయాణం..

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ - హుజురాబాద్

తనపై ఎంత దుష్ప్రచారం చేసి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఫేక్ వీడియోలు వైరల్ చేసినా తనను నమ్మి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెడతానని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తన విజయం కోసం అహర్నిశలు కృషిచేసిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. వారికి సేవ చేసుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి చేస్తానని.. నమ్మి ప్రజలు నన్ను గెలిపించినందున వారి కి అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుండి నిధులు తీసుకొని వస్తానని అన్నారు. నన్ను నా సతీమణి శాలినిరెడ్డి, కూతురు శ్రీనికారెడ్డి విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం నుండి నిధులు సాధిస్తానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం రూపొందించిన దళితబంధు, రైతుబంధు, రైతుబీమా, బీసీ సాయం లాంటి అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ వీటితోపాటు ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టి ప్రజలకు చేకూరుస్తే మంచిదని అన్నారు. నిధులు విడుదల చేయడంలో వివక్ష చూపితే ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామని అన్నారు.

ఎన్నికలకు ముందు ప్రజల్లో నన్ను తక్కువ చేయడం కోసం కొంతమంది అదే పనిగా ఫేక్ వీడియోలు వైరల్ చేశారని.. ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కలిసి తాను మాట్లాడినట్లు పాత ఫొటోలు జతచేసి ఫేక్ వీడియోలు వైరల్ చేస్తున్నారని ఇది తగదని అన్నారు. ఎన్నికల తర్వాత ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేద్దామని, అసత్య ప్రచారాలు విష ప్రచారాలు బంద్ చేయాలని ఆయన కోరారు. తాను ఉన్నంతవరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని, ఎలాంటి పార్టీ మార్పులు ఉండవని స్పష్టం చేశారు. నన్ను రాజకీయంగా ఎదిగించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల మేలు మర్చిపోయేవాడిని కాదని.. ఉన్నంతకాలం గులాబీ కండువాతోనే ఉంటానని అన్నారు. సమావేశంలో కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినీరెడ్డి, కూతురు శ్రీనికారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, సింగిల్‌విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, చొల్లేటి కిషన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఐలయ్య, మహిళా అధ్యక్షురాలు రమాదేవి, గందె శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు దేశరాజుపల్లి విద్యార్థులు



నవతెలంగాణ - రామడుగు

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మండలంలోని దేశరాజుపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. కరీంనగర్‌లోని స్పోర్ట్స్ స్కూల్లో జరిగిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ జూడో పోటీల్లో 8మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. సుల్తానాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు టి.పద్మ, పీఈటి ఎల్.వెంకటరమణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బాలికల 25కిలోల విభాగంలో ఎ.స్వాతి, 32కిలోల విభాగంలో యం.అర్పిత, 36కిలోల విభాగంలో ఏ.శివాణి, 40కిలోల విభాగంలో కావ్య, 44కిలోల విభాగంలో కె.సంధ్య, బాలురు 30కిలోల విభాగంలో డి.వేణుకుమార్, 35కిలోల విభాగంలో ఇ.శ్రీకాంత్, 66కిలోల విభాగంలో డి.అభినయ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఎంపికపట్ల గ్రామ సర్పంచ్ కోల రమేష్, ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మాడుగుల రత్నాకర్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ ఎల్కపెల్లి కుమార్, ఉపాధ్యాయులు, జూడో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కడారి అనంతరెడ్డి, జి.జనార్ధనరెడ్డి హర్షం వ్యక్తం చేస్తు అభినందించారు.

సుడా చైర్మన్ రాజీనామా లేఖ

నవతెలంగాణ-కరీంనగర్

కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మెన్ పదవికి జివి.రామకృష్ణారావు రాజీనామా చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఏర్పడిన రాజకీయ పరిణామాల దృష్ట్యా రాజీనామా చేసినట్టు ఆయన తెలిపారు.

జన్నారంలో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెడ్మా బొజ్జు గెలవడంతో మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ ర్యాలీ కాంగ్రెస్ కార్యాలయం నుంచి అంగడి బజార్ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు డప్పు వాయిద్యాలతో డీజే సౌండ్‌లతో, ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జరుగుతున్న సందర్భంలో స్థానిక పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మాట్లాడుతూ దొరల తెలంగాణకు చమర గీతం పాడి కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించిన మండల ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో కూడా పార్టీ అధికారంలోకి రావడం అభినందనీయమన్నారు. ఆరు గ్యారంటీ స్కీంలను తప్పకుండా అమలు చేసే విధంగా పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మాణిక్యం, జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్ మామిడి పెల్లి ఇంద్రయ్య, పసియుల్లా, దాముఖ కరుణాకర్, మత్స్య శంకరయ్య, ఎన్ఎస్‌యూఐ నాయకులు సోహెల్‌షా, అజ్మత్, దుమల రమేష్, శిరీష్, ప్రశాంత్, ముత్యం రాజన్న, గంగన్న, గూగులవత్ రవి, ప్రదీప్ పాల్గొన్నారు.

అదనపు ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-తాండూర్

పిల్లలకు అదనపు ఆహారాన్ని అందించడం ద్వారా పిల్లల్లో సంపూర్ణ ఆరోగ్యం తో పాటు ఎదుగుదల వృద్ధి చెందుతుందుతందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమతా అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామాపంచాయతీ లోని రెపల్లెవాడ అంగన్‌వాడీ సెంటర్‌లో సామాజిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చనుపాలతో పాటు ఆరు నెలల తర్వాత అదనపు ఆహారాన్ని అందించాలని సూచించారు. ఉడికించిన పప్పులతో పాటు అన్నాన్ని నుజ్జుగా చేసి ఉగ్గుగా తినిపించడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పిల్లలకు బాలామృతం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్యామల పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై కమ్యూనిస్టుల పోరు ఎప్పటికీ ఆగదు



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 30న జరిగిన ఎన్నికలు, డిసెంబర్ 3న వెలుబడిన ఫలితాలు ప్రజాస్వామ్యంలో అహంకార వైఖరిని ప్రజలు అంగీకరించరనే విషయాన్ని వెల్లడించే విధంగా ఉన్నాయని సీపీఐ కార్యవర్గ సభ్యుడు కలిందర్ అలీ ఖాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో విలువలతో కూడిన పాలన ముఖ్యమని, ప్రజా గొంతుకగా చట్ట సభల్లో సీపీఐ తమ గళాన్ని వినిపించేందుకు ప్రజలు అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సీపీఐ మిత్రపక్ష కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు అధిక మెజారిటీతో గెలిపించడం, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపుకు సహకరించిన ప్రజలకు పార్టీ తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

నియంతలా, నిరంకుశంగా పాలన సాగించిన పాలకులకు ఈ ఎన్నికలు గుణపాఠాన్ని నేర్పాయని, ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తే సహించేది లేదన్నరు. ఆత్మగౌరం కోసం, ఆత్మగౌరవ పరిపాలన కోసం తెలంగాణ ప్రజలు ఎప్పుడు పోరాటంలో ముందుంటారని తెలిపారు. ఎర్ర జెండా పార్టీలు ఎప్పుడు అధికారం కోసం తాపత్రయపడవని, ప్రజల సమస్యలపై, ప్రజా సంక్షేమంపై పోరాటాలు సాగిస్తాయని అన్నారు. ఓడితే గెలువవచ్చని, పడితే లేవచ్చని, కాని లాలుచీపడితే చరిత్ర క్షమించదని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల కోసం కాకుండా ప్రజలకు సుపరిపాలన అందాలనే లక్ష్యంతో ఒక్క సీటుకు కట్టుబడి రాష్ట్రంలోని 119 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలువుకు పార్టీ శ్రేణులు కృషి చేశాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రజల ఆకాంక్ష నెరవేర్చే దిశగా పాలన అందించడానికి తమ వంతు పోరాటాలు ఉంటాయని, నేడు ఏర్పడిన ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు పాలన అనిదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల కన్వీనర్ మామిడి విజయ్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపెల్లి పౌలు, దేవి పొచన్న, చాడ మహేందర్ రెడ్డి, భాసు పటేల్, రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, కాంగ్రెస్ నాయకులు మత్స్య శంకరయ్య మిక్కిలినేని రాజశేఖర్ పాల్గొన్నారు.

పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు



నవతెలంగాణ-వేమనపల్లి

డిసెంబర్ 2 నుంచి 8 వరకు మావోయిస్టు పార్టీ పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) వారోత్సవాల సందర్భంగా సోమవారం నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై సుబ్బారావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫారెస్ట్ రోడ్ గుండా ఆర్ఓపీ నిర్వహణ, గ్రామాల పరిధిలోని బ్రిడ్జ్, కల్వర్ట్‌లను, ఆకస్మిక తనిఖీ, ఏరియా డామినేషన్, ఫెర్రీ పాయింట్స్‌లను అనుమానిత ప్రదేశాలను తనిఖీ చేశారు. పడవల ద్వారా ప్రయాణం చేసే వారితో మాట్లాడి, వారిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ మట్లాడుతూ యువకులు సంఘ విద్రోహ శక్తులకు సహకరించవద్దని అన్నారు. పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 8 వరకు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయమన్నారు. మావోయిస్టుల ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదేవిధంగా మీ నివాస ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించినట్లయితే స్థానిక పోలీస్‌లకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

ఇద్దరు వెలమ దొరలను ఓడించిన బీసీ నేత..

- పట్టువదలని విక్రమార్కుడిలా ఆది పోరాటం..
- వెలుమ దొరల కంచు కోటలో బీసీ నాయకుడి జెండా..
- నాలుగుసార్లు ఓడినా ఎమ్మెల్యేగా గెలిచి డైరెక్ట్‌గా మంత్రివర్గంలోకి..?


టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసిన ఆది శ్రీనివాస్

నవతెలంగాణ - వేములవాడ

ఏండ్ల నుంచి గెలుపు కోసం పోరాడుతున్న ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలవడం పట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, బీసీ సామాజిక తరగతి ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. ఆది శ్రీనివాస్ 15 సంవత్సరాల కాలంగా అలుపెరుగని విక్రమార్కుడిలా రమేష్‌బాబుపై పోరాటం చేస్తూనే వచ్చారు. బీఆర్ఎస్ అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యే రమేష్ బాబును కాదని కరీంనగర్ ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి ఓడిపోయిన చలిమెడ లక్ష్మీనరసింహారావు తీసుకువచ్చి వేములవాడ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయించినా ఈ సారి మాత్రం ఆది శ్రీనివాస్‌కు గెలుపును దూరం చేయలేదు. నాలుగు సార్లు ఓడిపోయిన సానుభూతి, సెంటిమెంట్ ప్రజల్లో బలంగా తీసుకుపోయి 14581 ఓట్ల మెజార్టీతో నియోజకవర్గ ప్రజలు గెలిపించారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఆయనకు అత్యంత సన్నిహితుడుగా ఆదికి పేరు ఉంది. ఆ పరిచయంతోనే ఆది శ్రీనివాస్‌కు వేములవాడ దేవాదాయ చైర్మన్‌గా రెండుసార్లు పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా వేములవాడ నియోజకవర్గ ఏర్పాటు అయ్యాక 2009లో కాంగ్రెస్ పార్టీ నుండి ఆది శ్రీనివాస్, టిడిపి మహాకూటమి నుండి సిహెచ్.రమేష్‌బాబు పోటీపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కోసం 2010లో రమేష్‌బాబు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికల్లో మరోసారి పోటీపడ్డారు, 2014, 2018, అసెంబ్లీ ఎన్నికల్లోవరుసగా నాలుగు సార్లు రమేష్ బాబు ఆది శ్రీను ఓటమిని చూశారు.

2023 ఎన్నికల్లో ఆది శ్రీనివాస్‌కు సానుభూతి, సెంటిమెంట్ విపరీతంగా రావడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేని కాదని చలిమెడకు టికెట్ ఇవ్వడం శ్రీనివాస్‌కు కలిసి వచ్చిందని చెప్పాలి. 2009లో ఆది శ్రీనివాస్ ఓటమితో రమేష్ బాబుపై పౌరసత్వం కేసు కోర్టులో వేశారు, అప్పటినుండి శ్రీనివాస్ రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారారు . 15 సంవత్సరాలుగా రమేష్ బాబుపై పోరాటం చేస్తూనే వచ్చారు.

ఇద్దరు వెలమ దొరలను ఓడించిన బీసీ నేత..

ఉమ్మడి సిరిసిల్ల నియోజకవర్గంలో సిహెచ్.రాజేశ్వరరావు ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాంగ్రెస్ నుండి రేగులపాటి పాపారావు ఒకసారి గెలుపొంది టిఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ రాష్ట్రం, వేములవాడ నియోజకవర్గం ఏర్పాటయ్యాక వరుసగా నాలుగు సార్లు చెన్నమనేని రమేష్ బాబు విజయం సాధిస్తూ వచ్చారు. అప్పటినుండి నేటి వరకు ఒక్క బీసీ నేత ఎమ్మెల్యేగా గెలుపొందలేదు. తొలిసారిగా చట్టసభలో మున్నూరు కాపు సామాజిక తరగతికి చెందిన బీసీ నేత ఆది శ్రీనివాస్ అడుగు పెట్టబోతున్నారు అని కాంగ్రెస్ శ్రేణులు, బిసి సామాజిక తరగతి వాళ్ల సంబరాల్లో మునిగి తేలుతున్నారు. వెలుమ దొరల కంచుకోటలో బీసీ నాయకుడు జెండా పాతాడు, నియోజకవర్గ వ్యాప్తంగా హర్షధ్వానులు మోగిస్తున్నారు..

నాలుగు సార్లు ఓడినా ఎమ్మెల్యేగా గెలిచి డైరెక్ట్ మంత్రివర్గం లోకి ఆది..?

ఒకటి కాదు రెండు కాదు నాలుగు సార్లు వరుసగా పరాజయంపాలై 2023 ఎన్నిక కలిసి రావడంతో శాసనసభలో ఆది శ్రీనివాస్ అడుగుపెట్టబోతున్నారు. తన చిరకాల కోరిక నెరవేరింది. 15 సంవత్సరాల తర్వాత ఆయన అజ్ఞాతం వీడి రాజన్న శాప విమోచన నుండి పట్టాభిషేకం చేసుకోబోతున్నారని కాంగ్రెస్ శ్రేణులు సంతోషంలో ఉన్నారు. మొదటి నుండి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో మంచి సఖ్యత తో పాటు క్రమశిక్ష కలిగిన నాయకుడిగా రేవంత్‌రెడ్డి దృష్టిలో స్థానం సంపాదించుకున్నారు. త్వరలో ఏర్పడబోయే మంత్రివర్గంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు చోటు దక్కబోతుందని ఆయన గెలిచినప్పటి నుండి ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీసీ నేత కావడం, పక్కనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యేగా ఉండడంతో ఆదికి కలిసి వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నాఉ. అది నిజమే అన్నట్లుగా డీకే శివకుమార్ మంత్రివర్గంలో అభ్యర్థుల పేర్లను మీడియా సమావేశంలో తెలిపారని కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. నాలుగు సార్లు ఓడిపోతే ఓడిపోయే గాని ఎమ్మెల్యేగా గెలిచి డైరెక్ట్ మంత్రి కాబోతున్నారని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల మెగా స్పోర్ట్స్ మీట్ - 2కె23 ప్రారంభం


క్రీడాజ్యోతిని ప్రారంభిస్తున్న రమేష్‌రెడ్డి


మాట్లాడుతున్న ముద్దసాని రమేష్‌రెడ్డి

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్ 2కె23ను సోమవారం ప్రారంభించారు. ఈ నెల 9వరకు వారం రోజుల పాటు నిర్వహించే మెగా స్పోర్ట్స్ మీట్‌ను శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి, డైరెక్టర్ కర్రా నరేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో విద్యార్థులు శాస్త్రీయ నృత్యం ద్వారా అతిథులకు ఆహ్వానం పలికారు. ఒలంపిక్స్ గేమ్స్ తరహాలో క్రీడాకారులు వివిధ రకాల డ్రెస్ అలంకరణలో మార్చ్ ఫాస్ట్ ద్వారా గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దసాని రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి క్రీడల్లో విద్యార్థులు పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పొందవచ్చు అని చెప్పారు. డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి క్రీడల్లో పాల్గొనడం వలన పోటీతత్వం, ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. వారం రోజుల స్పోర్ట్స్ మీట్ లో తరగతులకు ఆటంకం కలగకుండా నిర్దేశించిన సమయం ప్రకారం స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. ఈ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్స్‌తో పాటు విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. వారం రోజుల స్పోర్ట్స్ మీట్‌లో క్రికెట్, వాలీబాల్, రన్నింగ్, త్రో బాల్, కబడ్డీ, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, షార్ట్‌పుట్ పోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ మీట్స్ కార్య నిర్వాహకులు డాక్టర్ ఎం.శ్రీరామచంద్, టి.వినయ్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల పాలనాధికారి పారువెల్ల రామారావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి గొంటి రమేష్, డిపార్ట్మెంట్ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పారమిత విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మెన్

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.అశ్విత 10వ తరగతి, బి.వంశిక 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన సీనియర్స్ మహిళా కబడ్డీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహతా తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా మెండోరాలో రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా కబడ్డీ చాంపియన్ పోటీలలో అశ్విత, వంశికు పాల్గొంటారు. 67వ ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎస్జీఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఆధ్వర్యంలో డిసెంబర్ 5 నుంచి 7వ తేదీ వరకు నల్గొండ జిల్లా ఇండోర్ స్టేడియంలో 67వ ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో అండర్-14 బాలుర విభాగంలో ఎల్.ప్రితమ్ 7వ తరగతి, అండర్-17 విభాగంలో ఎల్.సుప్రీత్ 9వ తరగతి, టి.రిషికుమార్ 10వ తరగతి పాల్గొంటారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో పాల్గొన్న విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ ఇ.ప్రసాద రావు, డైరెక్టర్లు అనూకర్ రావు, రశ్మిత, ప్రసూన వినోద్ రావు, వీయూఎం ప్రసాద్ లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రితేష్ మెహతా, ప్రోగ్రామ్ హెడ్, గోపికృష్ణ, సమన్వయ కర్తలు రవీంద్ర పాత్రో, రాము, హరిప్రియ, సరిత, పీఈటీ రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను కలిసిన హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



నవతెలంగాణ - హుజురాబాద్

బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను హుజురాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. తన ఎమ్మెల్యే ధృవపత్రాన్ని కేసీఆర్ చేతుల మీదుగా అందుకుని ఆశీస్సులు తీసుకున్నారు. ఎల్లవేళలా ఎప్పటికీ కేసీఆర్, బీఆర్ఎస్‌తో తన ప్రయాణమని కౌశిక్‌రెడ్డి తెలియజేశారు.